క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థిని మీనాక్షి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఇ రంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2న వనపర్తి జిల్లా కేంద్రంలో బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు గోపి, మీనాక్షి అండర్–16లో 60 మీటర్ల పరుగులో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మీనాక్షి ఈ నెల 7, 8వ తేదీలలో హనుమకొండలోని జేఎన్ సేడియంలో రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షిని పాఠశాల యజమాన్యం శాలువాతో సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పీఈటీ దామోదర్ పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

వనపర్తి రూరల్: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చమ్మ, సునిత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మండ్ల రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశా వర్కర్లతో బీపీ, షుగర్ పరీక్షలు చేయించడం సరికాదని, రాష్ట్రంలో ఎక్కడాలేని పనులు మన జిల్లాలో చేయించడం సరైంది కాదని పేర్కొన్నారు. పారితోషికం లేని అదనపు పనులు చేయలేమని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గోపాల్‌పేట: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ అన్నారు. ఆదివారం వారి సిబ్బందితో కలిసి డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ముగ్గురిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటివి చేయకూడదని అనారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు జీవవైవిధ్య సదస్సు

ఆత్మకూర్: ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో సోమవారం జీవవైవిధ్య సదస్సులు నిర్వహించనున్నట్లు ఎంపీఓ శ్రీరాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు గుంటిపల్లి, 9 గంటలకు మేడేపల్లి, 9:30 గంటలకు మోట్లంపల్లి, 10 గంటలకు దేవరపల్లి, 10:30 గంటలకు తిప్డంపల్లి, 11:15 గంటలకు జూరాల గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డ్ అధికారులు సదస్సుల్లో పాల్గొంటారని వివరించారు.

బాధితులను పరామర్శించిన నాయకులు

వనపర్తి రూరల్: మండలంలోని రాజపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త దారమోని సాయిలు శనివారం మృతి చెందాడు. దీంతో మాజీ మంత్రి సతీమణి బీఆర్‌ఎస్ నాయకురాలు సింగిరెడ్డి వాసంతి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళ దుర్మరణం

అమరచింత: గుర్తు తెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని మహిళ దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాగల్‌కడ్మూర్‌కు చెందిన తెలుగు శారద(35) గతేడాది నుంచి మతిస్థిమితం లేక అమరచింత పట్టణంలో యాచిస్తూ జీవిస్తోంది. ఆదివారం సాయంత్రం అమరచింత నుంచి పాంరెడ్డిపల్లికి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త బాలరాజు ఏడాది క్రితం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

లలితా త్రిపుర సుందరిదేవి అవతారం

- భక్తి శ్రద్ధలతో పూజలందుకుంటున్న అమ్మవారు
- మండపాల వద్ద అన్నదానం



పెబ్బేరు కన్యాకాపరమేశ్వరి ఆలయంలో లలితా దేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



భవానీ మాత ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

సాక్షి, నెట్‌వర్క్: మండల కేంద్రాలు, పట్టణాలు, గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వనపర్తి, శ్రీ రంగాపురం మండలాల్లో, సూగూరు, పెబ్బేరు పట్టణంలో లలితాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తకోట, కానాయపల్లిలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అమ్మవారి ఆశీర్వాదం తీసుకుని, శివలింగానికి పూజలు చేశారు. ఘనపురంలో లక్ష్మీదేవిగా, ఆత్మకూర్‌లో శ్రీమహాలక్ష్మిదేవిగా, పాన్‌గల్, కేతేపల్లి, గోప్లాపూర్, మాందాపూర్‌లలో లలితా త్రిపుర సుందరిదేవీగా పూజలు చేశారు. అమరచింతలో ధనలక్ష్మి అవతారంలో అమ్మవారిని రూ. 6,30,000లతో అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు. మదనాపురంలో లలితా త్రిపుర సుందరి దేవిగా



దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు.



వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళ భక్తులు



కొత్తకోట భవానీ ఆలయంలో మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి పూజలు



భవానీ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



ఖిల్లాఘనపురం లో లక్ష్మీదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గ్రామ పంచాయతీ నిర్మించి.. అప్పుల పాలయ్యాం

కొత్తకోట రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించి అప్పుల పాలయ్యామని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తకోట మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో అప్పరాల, రామకృష్ణాపురం, నాచారం పేట, నాటవెల్లి పెద్దతండా, విలియంకొండ, భూత్‌కూర్, సత్యహల్లి, పాలెం గ్రామాల్లో కొత్త గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.22లక్షలు మంజూరు చేస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అప్పులు చేసి భవనాలు నిర్మించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు రాలేదు. దీంతో అప్పులు తెచ్చిన వారు వడ్డీలు పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమపై దయదలిచి నిధులు మంజూరు చేసి తమను ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణంలో దినపత్రికలో జర్నలిస్టుగా పని చేస్తున్న శ్రీనివాసులుచారి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసులుచారిని పరామర్శించారు. ఈ సందర్భంగా మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ ఉన్నారు.

కూలిన డ్రెయినేజీ

ఆత్మకూర్: పట్టణంలోని బీసీ కాలనీలో డ్రెయినేజీ కూలిపోవడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీవెనమ్మ ఇంటిముందు రెండేళ్ల క్రితం నిర్మించిన సీసీ డ్రెయినేజీ కూలిపోయి నెలరోజులు అవుతున్నా పాలకమండలి సభ్యులు, పురపాలిక అధికారులు పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

రివ్యూ పిటిషన్ల తిరస్కారం.. మనువాదానికి నిదర్శనం



మదనాపురంలో మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మద్దిలేటి

మదనాపురం: ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల సవరణపై హక్కు పార్లమెంట్‌దేనని, రివ్యూ పిటిషన్ల కొట్టివేత మనువాదానికి నిదర్శనమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి మద్దిలేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మదనాపురం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా న్యాయ దేవత కళ్లకు గంతలు కడతారని, సుప్రీంకోర్టు ధర్మాసనం తన చెవులకు గంతలు కట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయాన్ని ప్రభావితం చేసే జాతి, లింగం, సంపద, అధికారం వంటి అంశాలను న్యాయ దేవత చూడకుండా, ఆమె నిష్పక్షపాతంగా ఉండేలా, వ్యత్యాసాలను గుర్తించకుండా నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1గా ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ, రివ్యూ పిటిషన్ దాఖలు చేయడాన్ని సుప్రీంకోర్టు అనుమతించి ఉంటే, కోర్టుల పట్ల సామాన్య ప్రజలకు నమ్మకం, గౌరవం పెరిగేదన్నారు. 70 ఏళ్ల పాటు రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకుండా అడ్డుకున్న సుప్రీంకోర్టు, అగ్రకులాల పేదలు ఎంత మంది ఉన్నారో కూడా లెక్క తేల్చకుండా కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు ఇస్తే తలూపిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బిజ్జ సహదేవుడు, జిల్లా నాయకులు బి నాగరాజు, దాసరి మురళి, దాసరి శ్రావణ్, ఖురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం



రవికిరణ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన అక్కల పద్మమ్మ, మహదేవ్‌గౌడ్ దంపతుల కుమారుడు రవికిరణ్ గౌడ్ డీఎస్సీలో ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ పిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం సాధించాడు. దీంతో ఆదివారం ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి రవికిరణ్‌గౌడ్‌ను శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహదేవన్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



ఆత్మకూర్‌లో సభ్యత్వం నమోదు చేయిస్తున్న నాయకులు

ఆత్మకూర్: బీజేపీ సభ్యత్వాలు తీసుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మనోహర్‌గౌడ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌లు తెలిపారు. ఆదివారం ఆత్మకూర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్, భూపాల్, సురేష్, బోరెల్లి రాము, అశోక్‌నంద, తదితరులు ఉన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



ఆత్మకూర్‌లోని కేషవనగర్‌లో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న మహిళలు



ఆత్మకూర్‌లో బతుకమ్మతో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, మహిళలు



ఆత్మకూర్‌లోని నీలకంఠేశ్వరుడి ఆలయంలో..

ఆత్మకూర్: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళల సంబురాలు అలరించాయి. ఆదివారం బతుకమ్మలను పూలతో అలంకరించి బొడ్డెమ్మలు వేసి ఆడిపాడారు. స్థానిక వాసవీమాత, నీలకంఠేశ్వరుడు, బాలబ్రహ్మేశ్వర, కేషవనగర్, భార్గవీనగర్‌లో, శివాజీనగర్‌తో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, మహిళలు, పాల్గొన్నారు.

ప్రకృతిని గౌరవించే పండుగ



ప్రకృతిని ఆరాధించడమే బతుకమ్మ పండుగ ఉద్దేశం. నవరాత్రుల్లో వైదిక సాంప్రదాయాలతో దేవీ పూజలు నిర్వహిస్తున్నాం. బతుకమ్మ మన సంస్కృతిని చాటి చెబుతుంది. అమ్మవారికి నిష్టతో 9రోజుల పాటు పూజలు నిర్వహించుకుంటాం.

– డీకే పారిజాతమ్మ, భక్తురాలు, ఆత్మకూర్

ఆనందంగా ఆడబిడ్డలు..



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఈ పండగ ఆడబిడ్డల పండగ. పుట్టింటికి వచ్చే ఆడబిడ్డల ఆనందంగా, ఊరంతా ఒక చోటకు చేరి అంతరాలు మరచిపోయి ఆడుకునేదే బతుకమ్మ ఆట, పాట. దేవీశరన్నవరాత్రులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటాం.

– గాడి అరుణాదేవి, భక్తురాలు, ఆత్మకూర్

బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



గ్రామాల మధ్య బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్డు పనులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. 10 ఏళ్లుగా నాటవెల్లి, పామాపురం, రామకృష్ణాపురం, అప్పరాల, ముమ్మళ్లపల్లి రోడ్డు గుంతల మయం కావడంతో గత పాలకులు పట్టించుకోలేదు. ఈ విషయం ప్రస్తుత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. వెంటనే బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయించి, పనులకు ఎమ్మెల్యే పూజ చేసి ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పి.కృష్ణారెడ్డి, ఎన్‌జె.బోయేజ్, బీచుపల్లి యాదవ్, శివరాములు, సంద వెంకటేష్, మాసన్న, రాంలాల్‌నాయక్, దిలీప్‌రెడ్డి ఉన్నారు.

గెలుపోటములు సమానంగా చూడాలి

సీఐ రాంబాబు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కొత్తకోట సీఐ రాంబాబు

కొత్తకోట: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా చూడాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆరోగ్య క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్స్ ఏర్పాటు చేశారు. క్రికెట్ పోటీలను సీఐ రాంబాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. వాకింగ్ క్లబ్, క్రికెట్ క్లబ్‌ల ద్వారా అందరికీ ఆరోగ్యం పంచుతూ చక్కని గుర్తింపు పొందిన క్లబ్ సభ్యులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు. క్రీడలను స్నేహపూరిత వాతావరణంలో కొనసాగించాలని నిర్వహకులు శంకర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య వాకింగ్ క్లబ్ నిర్వహకులు శేఖర్‌గౌడ్, అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, సభ్యులు గుంత శివ, రామకృష్ణ, రవిందర్‌రెడ్డి, బాలకృష్ణ, నవీన్, కృష్ణ, రవికుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన తులుశ బుడ్డమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం పరామర్శించారు. మంత్రి జూపల్లి పంపించిన రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ వెంకటయ్యయాదవ్, నాయకులు వాల్మీకినాయుడు, యుగంధర్‌గౌడు, ప్రేమ్‌సాగర్, గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మిత్రబృందం

పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన కుర్మయ్య కుటుంబానికి తమ వంతు సాయంగా 2000–2001 పదో తరగతి మిత్రులు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం కుర్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడని, దీంతో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు గురుకుల పాఠశాల లింగాలలో చదువుకున్న తోటి మిత్ర బృందం హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ద్వారా పోగు చేసిన నగదును కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మిత్ర బృందం భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శాలయ్య, కుమార్, శ్రీబాబు, గిరిబాబు, సహదేవ్, రాజేందర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించండి



మండల కేంద్రంలో ప్రహరీ లేని ప్రధాన సబ్‌స్టేషన్

వీపనగండ్ల: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌కు ప్రహరీ నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యుత్ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల రైతులకు అవసరమయ్యే ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్‌వైర్, ఫ్యూజ్‌వైర్లతో పాటు పలు రకాల విలువైన వస్తువులు సబ్‌స్టేషన్ ఆవరణలో ఉన్నాయి. వాటికి రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని విద్యుత్ ఉద్యోగులు పేర్కొంటున్నారు ప్రహరీ నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెబ్బేరులోని ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణ సమీపంలోని వల్లపురెడ్డి ఫంక్షన్ హాల్లో కలుసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రంగనాథ్, సత్యం, సింగన్న, ధర్మారెడ్డిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత



శ్రీరంగాపురంలో చెక్కులు అందజేస్తున్న ఏఐపీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి

వనపర్తిటౌన్: అర్హులైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వంలో లబ్ధిపొందుతారని ఏఐపీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, బీసీ సెల్ అధ్యక్షుడు కోట్ల రవి, ఫిషరీస్ చైర్మన్ నందిమల్ల యాదయ్య, మైనార్టీ నాయకుడు ఖమ్మర్ మియా, బి. కృష్ణ, కిరణ్ కుమార్, జానకిరాములు, రాగివేణు, బాబా, తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల, శ్రీరంగాపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఏఐపీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్‌లు అందజేశారు. కార్యక్రమంలో అశోక్ రెడ్డి, ఎల్లస్వామి, రామచంద్రయ్య, పి రాముడు, గంగాదర్, సోప్పరి రమేష్ పాల్గొన్నారు.

పూజలో ఏఐపీసీ కో ఆర్డినేటర్

గోపాల్‌పేట: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో ఆదివారం నిర్వహించిన ఆంజనేయస్వామి పూజా కార్యక్రమంలో ఏఐపీసీ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సాయం అందిస్తానని చెప్పారు. ఆలయ అభివృద్ధికి తక్షణ ఆర్థికసాయంగా పదివేలు ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆయన వెంట నాయకులు ప్రవీన్‌కుమార్‌రెడ్డి, శేఖర్, మునుస్వామి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, సుధాకర్ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.